విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 11, మార్చి 2025

సీపీఐ నాయకురాలి భర్తకు నివాళి..

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని పోరాట కాలనీలో నివసిస్తున్న సిపిఐ పార్టీ సీనియర్ నాయకురాలు అనంతమ్మ భర్త గోపాల్ (85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ అక్కడికి చేరుకుని గోపాల్ మృతి పట్ల చింతిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ ఆ కుటుంబానికి పలువురు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమైక్య సంఘం పట్టణ కార్యదర్శి సాలవేముల సూరి, ఏఐటీయూసీ నాయకులు వెంకటరమణ, సిపిఐ నాయకులు శ్రీనివాసులు యాదవ్, నాగేంద్ర పాల్గొన్నారు.

మా గ్రామానికి రోడ్డు వేయండి

-విద్యార్థుల ధర్నా

విశాలాంధ్ర-బొమ్మనహాల్ : మండలంలోని బందూరు గ్రామానికి చెందిన విద్యార్థులు 3 కి.మీ దూరంలో ఉన్న ఉద్దేహాల్ గ్రామానికి వెళ్ళి విద్యనభ్యసిస్తున్నారు. అయితే రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సోమవారం మట్టి రోడ్డుపై ధర్నా నిర్వహించారు. గ్రామానికి ఉద్దేహాల్ నుండి బస్సులో కూడా లేవని ఆటోలో ప్రయాణిస్తున్న గుంతలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ఆందోళనతో పాఠశాలకు వస్తున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. మా గ్రామం రోడ్డు సరిగా లేదు' అంటూ ఫ్ల కార్డులతో నిరసన తెలిపారు. కొన్ని సంవత్సరాల నుంచి తమ ఊరు రోడ్డు భారీ గుంతలు ఏర్పడి.. వర్షాకాలం వస్తే ఆ రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు వేయాలని కోరారు. విద్యార్థుల నిరసన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షితమైన ప్రసవం..

విశాలాంధ్ర-శెట్టూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు ప్రసవం సురక్షితమని డాక్టర్ తరుణ్ సాయి పేర్కొన్నారు సోమవారం గర్భిణు లకు క్లీనిక్ డే సందర్భంగా వివిధ రకాలైన పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు సమతుల్యమైన ఆహారం తీసుకుంటేనే కడుపులో బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని,ప్రైవేట్ హాస్పిటల్లో గర్భవతులకు భయభ్రాంతులకు గురిచేసి సాధారణ ప్రసవాన్ని కూడా సిజేరియన్ చేయాలని వేలకు వేలు డబ్బులు గుంజుతు న్నారని తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ లీలావతి, ల్యాబ్ టెక్నీషియన్ మంజునాథ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ మౌనిక, అఖిల, ఇంద్రజ పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని పెద్ద బజార్, చాంద్ టాకీస్ వద్ద సోమవారం ఆర్ఎంపి వద్ది నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు గుండె వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, అందుకే అనంతపురంలోని సాయినగర్ ఫస్ట్ క్రాస్‌లో ఉన్న మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి సౌజన్యంతో డాక్టర్ నాగరాజు సహకారాలతో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 150 మంది రోగులకు ఉచితంగా బ్లడ్ షుగర్, బిపి, ఈసిజి, టుడి ఎకో పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వీరిలో 20 మందికి గుండె చికిత్స కోసం మార్క్ హాస్పిటల్ కు రావాలని సూచించారు. కార్యక్రమంలో మహీధర్ మెడికల్ స్టోర్ యజమాని జయ పాల్ మార్క్ హాస్పిటల్ మేనేజర్ బాబురావు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు

విశాలాంధ్ర-రాప్తాడు : గర్భిణులు కాన్పు అయ్యే వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శివకృష్ణ సూచించారు. రాప్తాడు పీహెచ్సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది గర్భవతులకు బి.పి, షుగర్, హెచ్.బి, యూరిన్ పరీక్షలు చేశారు. గర్భిణులు క్రమం తప్పకుండా నెలసరి పరీక్షలు, పౌష్టిహారం, ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. ఎం.ఎల్.హెచ్.పి. నూర్ ఏ చిస్మి సోదరి షబానా రంజాన్ పండుగ సందర్భంగా గర్భవతులకు, సిబ్బందికి భోజన సౌకర్యం కల్పించారు. సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్వైజర్లు నరసింహ, అరుణ పాల్గొన్నారు.

నేడు సిడి బండి రథోత్సవం

విశాలాంధ్ర-డీ.హిరేహాల్ : బళ్ళారిలో నేడు దుర్గమ్మ సిడి బండి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆంధ్ర కర్ణాటక పరిసర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు వచ్చి తమ మొక్కులను తీర్చుకుంటున్నారని తెలిపారు.

పేరు మార్పు

మేము అనగా కే.సుధాకర్ మరియు ఆర్.అశ్విని అను మా కుమార్తె 21.11.2020 వై.సి.పల్లి గ్రామము పోస్టు, కంబదూరు (మండలం) అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం pin : 515787 నందు జన్మించింది. మా యొక్క కుమార్తె పేరును BULUGONDLA AARADHYA D/O.K.SUDHAKAR నుండి MIHIRAA BULUGONDLA D/O K.SUDHAKAR గా మార్పు చేయడమైనది. ఇదే పేరును Date of Birth Certificate నందు కూడా నమోదు చేయడమైనది. ఈ యొక్క మార్పును పత్రికా ముఖంగా తెలియజేస్తున్నాము.

ఇట్లు
K.Sudhakar

చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- సీపీఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్

విశాలాంధ్ర-యాడికి: పెద్దవడుగూరు మండలం కిష్టపాడు గ్రామంలో చేనేత కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి వెంకట రాముడు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కిష్టిపాడు గ్రామంలో చేనేత కార్మికులు చాలామంది చేనేత పైన ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు.. కానీ ప్రభుత్వం నుండి చేనేత కార్మికులకు సరైన ప్రోత్సాహం లేక చేనేత రంగం పూర్తిగా కుంటుపడిపోతున్నది నేతనులు స్తోమత లేక కూలిమగ్గం నేస్తూ చాలీచాలని కూలీతో జీవనపోరాటం చేస్తున్నారు, ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరి నేతన్న నేస్తం సంవత్సరానికి రూ.24వేలు నేత కార్మికునికి ఇవ్వాలని, 45 ఏళ్లకే చేనేత కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని, చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును అందించాలని, అన్ని విధాలుగా చేనేత కార్మికులను ఆదుకోవాలని సీపీఐ తరపున డిమాండ్ చేశారు. క్రిష్టిపాడు శాఖ సీపీఐ నూతన గ్రామ కమిటీ ఎన్నిక కార్యదర్శిగా అల్లాబకాష్, సహాయ కార్యదర్శులుగా, బద్దెల రామాంజనేయులు, శేషు గోపాల్ 9 మంది కమిటీ సభ్యులుగా సిపిఐ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రంగస్వామి, వి.రామాంజనేయులు, డి.రంగస్వామి, దాసు, చిన్న మద్దిలేటి, గంగన్న, చిన్న గంగులు, కంబగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే

విశాలాంధ్ర -గుత్తి : పట్టణం ఫుట్బాల్ గ్రౌండ్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షన ర్ల భవనంలో సోమవారం ఉదయం పెన్షన ర్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ అబూబాకర్, అదనపు కార్య దర్శి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో సావిత్రి బాయి 128వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సావిత్రి బాయి చిత్ర పటానికి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, అదనపు కార్య దర్శి జెన్నే కుల్లాయిబాబు పూల మాల వేసి నివాళులర్పించారు. సావిత్రి బాయి పూలే గురించి వక్తలు మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని ప్రచారం చేస్తున్నారు. కాని మహాతల్లి సావిత్రి బాయి పూలే .బ్రిటీష్ ఏజెంట్‌గా పని చేస్తు తాను స్థాపించిన స్కూల్ మరియు తాను చేపట్టిన కార్యక్రమాలకు పెండింగ్ మొత్తం క్రిస్టియన్ మిషనరీల ద్వారా వసూళ్ళు చేసుకొని, బ్రిటీషర్స్‌ను కీర్తిస్తూ ఆమె రాసిన కవితలకు బ్రిటిష్ ప్రభుత్వం సావిత్రి బాయి పూలేకి ఉత్తమ ఉపాధ్యాయురాలు అని అవార్డు ఇచ్చారని అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, అదనపు కార్య దర్శి జెన్నే కుల్లాయిబాబు, లక్ష్మి నారాయణ రెడ్డి,శామ్యూల్, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, స్వామిదాస్, షైక్షా వలి,దేవదాన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

- మజ్జిగ, మంచినీరు లేక కూలీలు విలవిల
- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున

విశాలాంధ్ర- కందుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణంరెడ్డి పల్లిలో జరుగుతున్న ఉపాధి పనులు అరకొరగా కల్పిస్తున్నారని చేసిన పనులకు జనవరి నెల నుండి వేతనాలు చెల్లించలేదని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం ఉపాధిహామీ పనుల పరిశీలన కార్యక్రమంలో భాగంగా జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి, సిపిఐ రాప్తాడు నియోజకవర్గం పి.రామ కృష్ణ, ఉపాధి హామీ కూలీలను స్వయంగా కలుసుకొని సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యావసర వస్తువుల ధరలు కూలీలు కొనుక్కుతినే పరిస్థితిలో లేవని దానికి తోడు చేసిన పనులకు నెలలు తరబడి వేతనాలు అందక ఉపాధి హామీ కూలీలు పూట గడవని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అధికారులు ఉపాధి కూలీలు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిముట్లు మజ్జిగ మంచినీరు సౌకర్యం ఎండ నుండి ఉపశమనం పొందడానికి నీడ సౌకర్యం, పని చేసేటప్పుడు ప్రమాదవశాత్తు ఏమైనా జరిగిన ప్రథమ చికిత్స చేసుకోవడానికి మెడికల్ కిట్స్ అందుబాటులో లేదన్నారు. ఇవి ఏమీ లేకుండా పనులు కల్పించడం చాలా బాధాకరమని, వృద్ధులకు వికలాంగులకి పనిలేదని, వీరికి పనులు కల్పించడం లేదన్నారు. కొలతలతో నిమిత్తం లేకుండా పని గంటలు కేటాయించి రూ.700 వేతనం 200 రోజులు పనిదినాలు కల్పించి, తక్షణమే ఉన్నత అధికారులు వీటి మీద దృష్టి పెట్టి ఈ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికుల నియోజకవర్గ నాయకులు రెడ్డప్ప, సీపీఐ నాయకులు రామాంజనేయులు రైతు సంఘం నాయకులు నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి..

విశాలాంధ్ర-జెఎన్టియుఏ : విద్యార్థులే ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం జెఎన్టియుఏ ఇంజినీరింగ్ కళాశాల లో వాధ్వాని ఫౌండేషన్ సంయుక్తంగా హ్యుమానిటీస్ విభాగం ఈఈఈ విభాగం సెమినార్ హాలో ట్రైన్ ది ట్రైనర్స్ ప్రోగ్రామింగ్ ఆన్ ఇంటర్ ప్యునరీ షిప్ అండ్ వెంచర్ క్రియేషన్ అనే సదస్సును రిజిస్ట్రార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ప్రపంచస్థాయిలో ఆఫ్రిక, కెనడా, ఆసియా వంటి ఖండాలలో లక్షల మందిరిని ఎంటర్ ప్రైనర్స్ (కంపెని స్థాపకులుగా) వాద్వాని ఫౌండేషన్ శిక్షణ ఇస్తున్నదని తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు అందించడానికి ఉపాధ్యాయులు తమకున్న పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకొని విద్యార్థులకు బోధించాలని తెలిపారు. అకడమిక్, ప్లానింగ్ డైరెక్టర్ ఆచార్య ఎస్ వి సత్యనారాయణ మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక కారణాల దృష్ట్యా విద్యార్థులను సొంతంగా, వ్యాపారాలు ప్రారంభించే స్థాయి సిద్ధపరిచే గురుతర బాధ్యత యూనివర్సిటీ తీసుకొందని, అందుకే ఈ కొత్త కోర్సును ప్రవేశ పెట్టేలా మొదట ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా లంకాదహనం.. బాణాసంచా వెలుగులు

హాజరైన వేలాదిమంది భక్తులు

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ గవిమఠం శ్రీచంద్రమౌళీశ్వర స్వామివారి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి చంద్రమౌళీశ్వరుడు అశ్వవాహనంపై విహరించారు. అనంతరం లంకాదహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవం అనంతరం లంకాదహనం (బాణాసంచా వేడుక) కన్నుల మిరుమిట్లు గొలిపే కాంతులతో భక్తులను అలరించాయి. ముందుగా శ్రీచంద్రమౌళీశ్వర స్వామి వారికి విశేష పుష్పలంకారాలు జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై ఉత్సవ విగ్రహాన్ని ఉంచి భాజాభజంత్రీల నడుమ ఎదురు బసవన్న గుడి వరకు ఊరేగించారు. పూజల అనంతరం అక్కడి నుండి లంకాదహనం జరిపే మైదానం వరకు కార్యక్రమాన్ని ఊరేగించారు.అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి లంకాదహణం జరిపారు.కళ్ళు మిరుమిట్లు గొలిపే బాణాసంచాను పేల్చి లంకాదహానాన్ని కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. లంకాదహన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో ఉరవకొండ పట్టణ పరిసరాలన్నీ జనసందోహంగా మారాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. మఠం పీఠాధిపతి చెన్న బసవ రాజేంద్ర స్వామి, ఉత్తరధికారి శ్రీకరిబసవ రాజేంద్రస్వామి, ఆదోని చౌకి మఠం పీఠాధిపతి కల్యాణి స్వామి, సహాయ కమిషనర్ రాణి అర్చకులు, మఠం సిబ్బంది, గోపి, నారాయణస్వామి పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



విశాలాంధ్ర-గుంతకల్: గుంతకల్ రైల్వే స్టేషన్ నుండి తిమ్మంచర్ల రైల్వే స్టేషన్ అప్లైన్ ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. ఈ సందర్భంగా రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ కిలోమీటర్ నెంబర్ 440 / 29 వద్ద గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు ఈ వ్యక్తి పేరు ఊరు అడ్రస్ తెలియ రాలేదు అతని వద్ద ఎలాంటి ప్రూఫ్స్ లభించలేదు ఇతని వయసు 25 నుండి 30 ఉంటుందని ఇతని మెడలో జంధ్యము ఉన్నది గుర్తుపట్టిన వారు నెంబర్ 9866 144616కు తెలపాలని కోరారు.

సంగమేశ్వర స్వామి రథానికి భారీ విరాళాలు

విశాలాంధ్ర-కూడేరు : శ్రీ జోడి లింగాల సంగమేశ్వర స్వామి వారి నూతన రథం నిర్మాణం కోసం సోమవారం తోపుదుర్తి బ్రదర్స్ కుటుంబ సభ్యులు, వారి పితృమూర్తులు అయిన తల్లి తోపుదుర్తి నారాయణమ్మ, తండ్రి తోపుదుర్తి అక్కలప్ప జ్ఞాపకార్థం స్థానిక ఎంపీటీసీ తోపుదుర్తి వెంకటలక్ష్మి, వైసిపి నాయకుడు తోపుదుర్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో రూ.50,116లు నిర్వాహకులకు ఆలయ అర్చకుడు మహేష్ స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ప్రత్యేక పూజలు చేసి నిర్వాహకులతో కలిపి తోపుదుర్తిని సన్మానించారు, జోడి లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ కమిటీ మాజీ నెంబర్ వై.అలివేలమ్మ, ఆమె భర్త వై.లక్ష్మీనరసప్ప రూ.50,116లు విరాళంగా నిర్వాహకులకు అర్చకుడు మహేష్ స్వామికి అందజేశారు, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి తోపుదుర్తి రామాంజనేయులు మాజీ ఆలయ కమిటీ చైర్మన్ నూతన రథం నిర్వాహకులునాగరాజు, రామదుర్గం కిష్టప్ప, కుమ్మరఓబలప్ప, మల్లికార్జున పాల్గొన్నారు..

వైసిపి యువత పోరును విజయవంతం చేయండి

ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ : వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈనెల 12వ తేదీన వైసీపీ పార్టీ జరప తలపెట్టిన వైసిపి యువత పోరు కార్యక్రమాన్ని విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, యువ నేత భీమిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉరవకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ఆయా కాలేజీలకు చెల్లించకుండా చేతులు ఎత్తేయడంతో పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక పరీక్షలు రాయలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించండి

విశాలాంధ్ర-రాప్తాడు : బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. బీసీల సమస్యలపై అసెంబ్లీలో ఆమె సోమవారం మాట్లాడారు. ముందుగా బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి 47వేల కోట్లకు పైగా నిధులు కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ లకోసం ప్రకటించిన ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలుచేయాలని కోరారు. గతంలో బీసీ విద్యార్థుల కోసం స్కూల్స్, హాస్టల్స్ ఏర్పాటు చేశారన్నారు. మా సొంత మండలంలోని ననకోట సమీపంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా ఎంజేపీ బాలికల పాఠశాల నిర్మించారని, ప్రస్తుతం ఆ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ పాలనలో ప్రభుత్వం హాస్టల్స్, స్కూల్స్ పరిస్థితిని గాలికి వదిలేసిందన్నారు. బీసీ హాస్టల్స్, ఎంజేపీ, మోడల్ పాఠశాలల్లో విద్యార్థులకు తగినన్ని బాత్ రూమ్‌లు, టాయిలెట్స్ లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెన్నేకొత్తపల్లి బీసీ బాలుర హాస్టల్, పేరూరు ఎంజేపీ బాలుర పాఠశాల, కనగానపల్లి మోడల్ పాఠశాలల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. చెన్నేకొత్తపల్లి బీసీ బాలుర హాస్టల్ లో సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు తగిన భద్రత కల్పించాలని కోరారు. రామగిరి కొత్త బీసీ హాస్టల్ భవనంతో పాటు కొన్ని సమస్యల్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మా ప్రాంతంలో బీసీలు ఎక్కువగా ఉన్నందున రుణాలు కూటమి ప్రభుత్వం మరిన్ని పెంచాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ అంశాలపై స్పీకర్ రఘురామకృష్ణంరాజు అభినందించారు.

గ్రానైట్ నాపరాల్ల పరిశ్రమలను పరిరక్షించండి

విశాలాంధ్ర-తాడిపత్రి: తాడిపత్రి ప్రాంతంలోని గ్రానైట్ నాపరాల పరిశ్రమలను పరిరక్షించాలని సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గతంలో తాడిపత్రి ప్రాంతంలో దాదాపు 1800 గ్రానైట్, నాపరాల పరిశ్రమల్లో ఎంతోమంది కార్మికులు ఉపాధి పొందుతూ ఉండేవారన్నారు. అంతేకాకుండా తాడిపత్రి ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం, రాయల్టీ చార్జీలు పెంచడం వల్ల పరిశ్రమలోని యంత్రాలన్నీ గుజిరి అంగళ్లకు వేశారన్నారు. విద్యుత్ చార్జీలు, రాయల్టీ చార్జీలు తగ్గించి ఆదుకోవాలని కోరారు.

విశిష్ట సంఖ్యను రిజిస్ట్రేషన్ చేయండి..

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్ప యాదవ్..

విశాలాంధ్ర-శింగనమల : ఏపీ ఫార్మా రిజిస్ట్రేషన్ పథకాన్ని రైతు పాస్ పుస్తకాల ఖాతాకు విశిష్ట సంఖ్యను రిజిస్ట్రేషన్ చేయాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శింగనమల తహసీల్దార్ కార్యాలయం దగ్గర ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్పయాదవ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన రైతు పొలం సర్వే నంబర్లకు ఫార్మా రిజిస్ట్రేషన్ పథకాలు మొదలుపెట్టి నెల రోజులు అవుతున్నా ఆచరణలో సాధ్యం కాలేదని కేవలం సర్వే నంబర్లపైన విశిష్ట నంబర్ సంఖ్యను రిజిస్ట్రేషన్ చేస్తే ఖాతాలో ఉన్న మిగతా సర్వే నెంబర్లు కనుమరుగే అయ్యే అవకాశం ఉందని గతంలో రీసర్వే వల్ల తప్పిదాలు జరిగినట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియలు కూడా తప్పిదాలు జరిగే అవకాశం ఉందని, ప్రభుత్వ భూములు ప్రైవేటు భూములు అనే నిబంధన లేకుండా అన్ని భూములకు పాసు పుస్తకంలో ఉన్న అన్ని సర్వే నంబర్లకు విశిష్ట నంబర్లను కేటాయించాలని, తద్వారా పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ పథకం, పంట నష్టపరిహారం, పంటల బీమా పథకాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సీడిపై యంత్రపరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యం పై రాయితీ, పంట రుణాలు, తధితర పథకాలు రైతులకు నష్టం కల్గకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మధుయాదవ్, చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి మధు, రైతు సంఘం నాయకులు వెంకటరెడ్డి, నారప్ప, బండి వెంకటరాముడు రామసుబ్బారెడ్డి, శీనా, ఆదినారాయణ, చికెన్ భాషా, మసూద్ వలి, మధురెడ్డి, దస్తగిరి, వెంకటేష్, జయరాంనాయక్, కోనప్ప, విజయ్, రామాంజనేయులు, సుంకన్న, నల్లప్ప, తిరుపాలు, దుబ్బన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం పట్టణంలోని కమలానగర్‌లో ఉన్న శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా నిర్వహిస్తు న్నామని, ఈ రోజు పరీక్షలకు (జనరల్ విద్యార్థులు) 16,623 గాను 16,367 మంది హాజరు అయ్యారని తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు 1,780 గాను 1,737 మంది హాజరు కావడం జరిగగా, 43 మంది గైర్హాజర్ అయ్యారు. ఈ సందర్భంగా కన్వీనర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి 04 పరీక్షా కేంద్రాలను, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 5 పరీక్షా కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10 పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు 12 పరీక్షా కేంద్రాలను కస్టోడియన్లు 13 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కలెక్టర్‌తో పాటు కన్వీనర్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకట రమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించండి

మున్సిపల్ ఆఫీస్ ఎదుట సిపిఐ ధర్నా

విశాలాంధ్ర -గుంతకల్: పట్టణంలో మౌలిక వసతులు కల్పించాలని నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి.మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ ముందు వివిధ కాలనీవాసులతో కలసి సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ అధ్యక్షత ధర్నా చేపట్టారు. గుంతకల్ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, మహేష్ మాట్లాడుతూ ధోనిముక్కల ఆర్డిటి బిల్డింగ్‌లో సుమారు ఎనిమిది సంవత్సరాలుగా అక్కడి ప్రజలు నివసిస్తున్నా మున్సిపల్ అధికారులు ప్రజలకు నీటి సౌకర్యం, విద్యుత్ బల్బులు రోడ్లు, లేవు సైడ్ కాలువలు, సిసి రోడ్లు కల్పించలేదన్నారు. సంతోష్ నగర్ కాలనీకి వెళ్లాలంటే రోడ్డుకు విరువైపులా కంప చెట్లు వేపుగా కాసి, పాములు, విష పురుగులు ఎక్కువ సంచరిస్తుంటాయి ఆ రోడ్డులో ప్రజలు పోవాలంటే అరచేతిలో ప్రాణం పెట్టుకుని పోవాల్సిందే అంతేకాక ఎండాకాలంలో నీళ్లు లేవు వాటర్ పైపులైన్‌లు లేవు కొళాయిలు లేవు వాటర్ ట్యాంక్‌తో ఇంటికి పది బిందెలు పట్టుకునే పరిస్థితి ధోని ముక్కల్లో ఉన్నది అసలే ఎండాకాలం అంతేగాక దోమలు ఎక్కువగా ఉండటం వల్ల మలేరియా, టైఫాయిడ్లుతో ప్రజలు అల్లాడిపోతున్నారు కనీసం మున్సిపల్ అధికారులు ఆ కాలనీలు సందర్శించిన పాపాన పోలేదు ఇప్పటికైనా అధికారులు రోడ్లు ,సైడ్ కాలువలు ,కుళాయిలు మౌలిక వసతులు కల్పిస్తారని లేకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలుపుతున్నాము ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, సిపిఐ రూరల్ కార్యదర్శి రాము రాయల్, రామాంజనేయులు, ఏఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులు టి సురేష్, ఈశ్వరయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దేవేంద్ర ,ఏ ఐ వై ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ, నందు, బాబి ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, పుల్లయ్య ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు అఖిల్ , పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రోహిత్ ,మనీ సిపిఐ నాయకులు నూర్ భాషా, గురుస్వామి, గద్దం, భాష, వినోద్, వెంకట్ నాయక్, చిదంబరం, పృథ్వి, దాసరి శ్రీనివాసులు, మధుబాబు, రామాంజనమ్మ, సంతోష్ నగర్ లక్ష్మి, ఆటో అంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర-గుత్తి : గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాలు సోమవారం మధ్యాహ్నం 1 గంటలకు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ చౌదరి, గౌరవ సలహాదారు సూర్యనారాయణ రెడ్డి, సమితి మహిళా నాయకురాలు కందుల హేమలత బీజేపీ సీనియర్ నాయకులు రంగరాజు, మనోహర్, వలి, గుత్తి టౌన్ వైస్ చైర్మన్ రామమోహన్, గుత్తి మండలం ప్రయివేట్ పాఠశాలల సంఘ నాయకులు అల్లాబకాష్ హాజరయ్యారు. సందర్భంగా సంరక్షణ సమితి టీం సభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలోని పలువురు డాక్టర్లను, నర్సులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి లో డాక్టర్లు,నర్సుల సేవలను మాటల్లో చెప్పలేమని, వారి సేవలు అనంతనని రోగుల విషయంలో వారు చూపిస్తున్న శ్రద్ధను ఈ సందర్భంగా గుర్తుచేశారు. సమితి గౌరవ సలహాదారులు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి గుత్తి ఆసుపత్రికి చరిత్ర ఉందని రాయలసీమ లోనే మొదటి ఆసుపత్రి అప్పటి బ్రిటిష్ వారి కాలంలో మొదలు పెట్టడం జరిగిందని, గుత్తి ప్రాంతంలో స్వాతంత్ర ఉద్యమంలో ఈ ప్రాంత మహిళల పాత్ర అద్భుతం అని, ఎందరో స్వాతంత్ర సమరయోధులు ఈ ఆసుపత్రిలో సేవలు అందుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ చౌదరి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి గుత్తి కోట మెమెంటోను అందజేశారు.

ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి సహాయ కార్యదర్శి వీరేష్, గౌరవ సభ్యులు దస్తగిరి, శివ, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 11, మార్చి 2025

మా భూములను మాకే తిరిగి ఇప్పించండి

– సిపిఐ నాయకులు ఆధ్వర్యంలో గిరిజన రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర-ముదిగుబ్బ : ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ కబ్జా చేసిన మా భూములను తిరిగి తమకే ఇప్పించాలని మండల పరిధిలోని అదవి బ్రాహ్మణపల్లి తాండ గ్రామ రైతులు ,మహిళలు సోమవారం సిపిఐ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముదిగుబ్బ రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న మా భూములను మా ప్రాంతానికి సంబంధంలేని ఎంపీపీ ఆదినారాయణ మాకు తెలియకుండా మా భూములను ఆయన పేరిట ఆయన బంధువుల పేరిట రికార్డుల్లో నమోదు చేయించుకుని స్వాహా చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ విషయంపై సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు రామకృష్ణ మా గ్రామానికి వచ్చి ఈ భూముల కబ్జా గురించి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

దీంతో రెవెన్యూ ఉన్నతాధికారులు రెండు రోజులు పాటు మా గ్రామంలో, ఈ భూములను తూతూ మంత్రంగా పరిశీలన చేసి నేటికీ ఎటువంటి చర్య తీసుకోలేదని తహసీల్దార్ నారాయణస్వామితో తీవ్రస్థాయిలో వాదించారు, ఏబి పల్లి తండాలో కబ్జాకు గురైన గిరిజన రైతుల భూములను రెవెన్యూ అధికారులు తిరిగి వారికి ఇప్పించకపోతే త్వరలోనే ఆ రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరంతర ఉద్యమాలు చేపడతామని, ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు హెచ్చరించారు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేదలకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే దాన్ని విచారణ చేయించాల్సింది పోయి ఆయన పైన ధర్మవరం బీజేపీ నాయకులు హరీష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం దారుణమని శ్రీనివాసులు ఆరోపించారు, ఇప్పటికైనా ఈ విషయమై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్యప్రసాద్ తక్షణమే ఈ భూమల కబ్జాపై ఐఏఎస్ అధికారులతో విచారణ చేయించి ఎంపీపీ వల్ల భూములు కోల్పోయిన గిరిజన రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో బాధిత గిరిజన రైతులతో పాటు స్థానిక సిపిఐ నాయకులు తిప్పయ్య, గంగిరెడ్డిపల్లి నాయుడు, లింగుట్ల వెంకటరాముడు, రాధాకృష్ణ, ముత్తులూరి మధు, అమిలినేని రామంజి, కొండయ్య, బావయ్య, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-పుట్టపర్తి : ముదిగుబ్బ మండలం సంకేపల్లిలో నాపై దాడి చేసిన వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన నన్ను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఒక్కడినే వెళ్లి కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ కలెక్టర్ ను కలిసేందుకు భారీ ఎత్తున అనుచర గణంతో వచ్చిన నన్ను పోలీసులు అడ్డుకోవడం బాధాకరమన్నారు.టిడిపి మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ,బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి లపై విమర్శలు కురిపించాడు. అణగారిన వర్గానికి చెందిన నాపై ధర్మవరానికి చెందిన ఒక నేత బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి టిడిపి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కక్షగట్టారని వాపోయారు. ముదిగుబ్బ మండలం సంకేపల్లి గ్రామంలో నాపై జరిగిన భౌతిక దాడి ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. 2020లో పెనుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో భూ అక్రమాలకు సంబంధించి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి పై నమోదైన కేసుకు చార్జిషీట్ దాఖలు చేయాలని ఎస్పీని కోరారు. ముదిగుబ్బ మండలంలో ఇటీవల చోటుచేసుకున్న భూ వ్యవహారానికి సంబంధించి రాజకీయ ఒత్తిడికి తలొగ్గకుండా దర్యాప్తు చేసి నిజానిజాలు వెలికితీయాలన్నారు. రాజకీయంగా ఎదుగుతున్న నన్ను అణగదొక్కేందుకు కొందరు కుట్రపన్ని నన్ను అంతమొందించాలని చూస్తున్నారని నాకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి విద్యాసంస్థల పేరుతో చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, భూ కుంభకోణాలు, మనీలాండరింగ్‌పై ఈడితో సిబిఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అమాయకులైన గిరిజను లను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్న రాజకీయ నాయకు లకు త్వరలోనే బుద్ధి చెబుతామన్నారు. వినతిపత్రం అందజేసేందుకు నేను వస్తున్నానని తెలిసి పోలీసులను అడ్డుపెట్టి అవాంతరాలు సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి నారా లోకేష్‌కు వేర్వేరుగా మాజీమంత్రి పల్లె, ఎస్పీ స్వాగతం

విశాలాంధ్ర-పుట్టపర్తి : కదిరి శ్రీ ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం తరపున స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి విచ్చేసిన ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు సోమవారం పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముస్లిం,మైనారిటీ విభాగపు కార్యదర్శి మహమ్మద్ రఫీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ముస్లింల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని మహమ్మద్ రఫీ కోరారు. జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

విశాలాంధ్ర-పుట్టపర్తి : సత్యసాయి విమానాశ్రయంలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్, శాఖా మంత్రి నారా లోకేష్‌ని ఎస్పీ వి.రత్న ఘన స్వాగతం పలికారు. సోమవారం గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి సత్య సాయి ఎయిర్పోర్ట్ కు చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర-పెనుకొండ: డిసెంబర్‌లో వదాన్య జన సొసైటీ వారు 9, 10 తరగతులకు జిల్లా స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో గుట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని బి.మౌనశ్రీ మండలం టాపర్‌గా నిలిచింది. మండల టాపర్ గా నిలిచినందుకు వదాన్య సంస్థ వారు రూ.4 వేలు, షీల్డ్, ప్రశంసాపత్రం అందజేశారు. మండల టాపర్ గా వచ్చిన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి నాగార్జున ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికుడు నరసింహులు (38) నగర పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ సోమవారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో కొండాపురం గ్రామం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణీ స్త్రీలకు భోజనం ఏర్పాటు

విశాలాంధ్ర-తలుపుల: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రతి నెల గర్భిణీ స్త్రీలకు భోజనం నిర్వహిస్తున్న మదర్ తెరిసా స్ఫూర్తితో ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఏపీఎం బాబ్జాన్, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్య అధికారి ఆఫ్తాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలుపుల మండలంలో నలువైపుల నుండి దాదాపు 40 కి.మీ దూరం నుంచి గర్భిణీ స్త్రీలు హాస్పిటల్‌కి వచ్చి చికిత్స చేయించుకుంటూ మధ్యాహ్న సమయంలో భోజనం కోసం ఇబ్బంది పడుతుండటంతో ఫ్రెండ్స్‌తో కలిసి మాట్లాడుకొని అన్నదానం చేశారు.

ప్రతి ఇంటి నుండి చెత్త సేకరించాలి

విశాలాంధ్ర-ఎన్‌పికుంట : మండలంలోని అన్ని గ్రామాలలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరించి వాటి ద్వారా వచ్చే పైకము పంచాయతీలకు చెల్లించాల్సిన భాద్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీవో అంజనప్ప పేర్కొన్నారు. సోమవారం ధనియాని చెరువు పంచాయతీలో క్లాప్ మిత్రల ద్వారా రోజు నిర్వహించే చెత్త సేకరణను ఈవోఆర్డీ మాధవరెడ్డి పరిశీలించారు. తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తను వర్మీ కంపోస్టుకు, పొడి చెత్తను ప్రతి గురువారం అమ్మకానికి పెట్టాలన్నారు. తద్వారా వచ్చే పైకము పంచాయతీ నిధులకు చలానా ద్వారా చెల్లించాలన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

విశాలాంధ్ర - అగళి : మండలంలోని మధూడి ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యాబ్యాసం చేస్తున్నా మధూడి జడ్పీ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న ఎం ప్రణీత్ కుమార్ ఆదివారం అనంతపురం లో జరిగిన వదన్య టాలెంట్ టెస్ట్ లో ఉత్తమ ప్రతిభ కనబరచి మండల టాపర్ గా నిలిచారు. ఈ సందర్భంగా వదన్య టాలెంట్ టెస్ట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రంతో పాటు నాలుగు వేల రూపాయల నగదు బహుమతి సాధించారు. వసతి గృహానికి వన్నెతెచ్చిన ప్రణీత్ కుమార్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసేగౌడ్ ఉపాధ్యాయులు హాస్టల్ వార్డెన్ సికిందర్ భాష అభినందించారు.

అనంతరం వార్డెన్ మాట్లాడుతూ ప్రణీత్ కుమార్ స్వగ్రామం కళ్యాణదుర్గం నియోజకవర్గం లోని కంబదూరు మండలం కొత్తపల్లి గ్రామం నుండి మన ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ చదువుతున్న ఇటు పాఠశాలకు వసతి గృహానికి అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ప్రణీత్ కుమార్ భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో టాలెంట్ టెస్ట్ లలో పాల్గొని ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలను అందుకోవాలని ఆకాంక్షించారు.

హరీష్‌కుమార్ మాట అదుపులో పెట్టుకో..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను విమర్శించే స్థాయి నీది కాదు..
- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-పుట్టపర్తి: హరీష్‌కుమార్ మాట అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. సోమవారం సాయి ఆరామంలో వేమయ్య యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 3 తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలో భాగంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కొన్ని పత్రికలలో కథనాలు వచ్చాయని చెడ్డ పేరు వచ్చే వ్యక్తులను దగ్గర పెట్టుకోవద్దని సలహా ఇచ్చాడన్నారు. మార్చి 4వ తేదీ అదవి బ్రాహ్మణి పల్లి తండాలో రామకృష్ణ పర్యటించగా తాండలోని గిరిజనుల భూములను ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ అనుచరుల పేర్లతో పాసుబుక్కులను చేయించుకున్నాడన్నారు. గిరిజనులు దరఖాస్తు చేసుకున్న పత్రాలను రోడ్లపై విసిరివేయడం జరిగిందన్నారు. విజయవాడలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వాట్సప్‌లో సమాచారం పంపగా, తక్షణం విచారణ జరిపినందుకు సిపిఐ పార్టీ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గిరిజనుల భూములపై ఆదినారాయణ అనుచరులు బ్యాంకులలో లోన్లు తీసుకున్నారని చెప్పారు. ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురం చెందిన క్రషర్ యజమాని లక్ష్మీనారాయణ ప్రాజెక్టు పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లారని, తాము చెప్పిన చోటే కంకర కొనాలని సైట్ ఇంజనీర్లను బెదిరించాడన్నారు. ఆదినారాయణ యాదవ్, లక్ష్మీనారాయణ 3 వేల కోట్లు ఆపే యత్నం ఎవరు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నామన్నారు. అదవి బ్రాహ్మణపల్లి తండా యోగివేమన జలాశయం నిర్మాణంలో భూములు గిరిజనలు గ్రామానికి చుట్టుపక్కల ఉన్న గుట్టలు మిగులు భూముల్ని చదును చేసుకుని సాగు చేసుకుంటున్నారని, మూడు దశాబ్దాలుగా వాటి పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. గిరిజనులు అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆదినారాయణ యాదవ్ ఆ భూముల్లో చాలా వరకు తన కుటుంబ సభ్యులు ,బంధువుల పేర్లతో ఆన్లైన్లో ఎక్కించుకున్నారని ఆరోపించారు. ధర్మవరంలో చేనేత కార్మికులు బిసి ఎమ్మెల్యే సత్యకుమార్‌కు ఓట్లు వేయడం జరిగిందని, చేనేత కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ధర్మవరంలో చేనేత కార్మికులు ఇబ్బందులను కూటమిలో ఉన్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు తెలపగా, ఆయన చేనేత కార్మికుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో పదివేల మందిలో ఎవరి వసూళ్ల మామూలుగా గుర్తు రావడం లేదా హరీష్ అన్నారు. ధర్మవరంలో వ్యాపారస్తులను హరీష్ కుమార్ బెదిరింపులకు గురిచేస్తున్నాడన్నారు. సిపిఐ పార్టీ గిరిజన తాండవాసులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, ధర్మవరం నియోజక వర్గం మధు, పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, పెనుగొండ నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు, పుట్టపర్తి పట్టణ కార్యదర్శి వినోద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మహిళా సమైక్య జిల్లా నాయకులు జయలక్ష్మి, బత్తలపల్లి మండల కార్యదర్శి వెంకటేష్, డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, నల్లమడ మండల కార్యదర్శి రమణ, ధర్మవరం పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, చేనేత జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రామకృష్ణను మాట్లాడే నైతిక హక్కు లేదు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: బీజేపీ నాయకుడు హరీష్ బాబు నోరు అదుపులో పెట్టుకోవాలని మండల సిపిఐ కార్యదర్శి చల్లా శ్రీనివాసులు హెచ్చరికలు చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గురించి మాట్లాడే నైతిక హక్కు మంత్రి కార్యాలయ ఇన్చార్జి హరీష్‌కు లేదన్నారు, హరీష్ బాబు భూకబ్జాలు చేసిన నాయకులను పక్కన పెట్టుకొని సిపిఐ రామకృష్ణను మాట్లాడడం సబబు కాదన్నారు. భూకబ్జాలు చేసిన నాయకులు పైన అధికారులతో విచారణ చేయించి నిజాయితీని నిరూపించి మాట్లాడు. మీరు మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించు కుంటారని హెచ్చరించారు.

పుట్టగతులుండవు..

విశాలాంధ్ర-కదిరి: హరీష్‌బాబు నోరు అదుపులో పెట్టుకో...కమ్యూనిస్టులతో పెట్టుకుంటే పుట్టగతులుండవని జిల్లా వ్యవసాయం కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి బి. కదిరప్ప పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హరీష్ బాబు నీవు ఇక్కడికి వలస వచ్చి నోరుంది కదా అని మా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణపై మాట్లాడే తీరు సరిగా లేదని మండిపడ్డారు. గతంలో పలు చోట్ల చేసిన ఘనకార్యాలు అందరికీ తెలిసినవేనని అన్నారు.గురిగింజ తన కింద ఉన్న నలుపు ఎవరికీ తెలియదు అన్నట్లుగా నీ వ్యవహారశైలి ఉందని మండిపడ్డారు. కామ్రేడ్ రామకృష్ణ ను మాట్లాడే స్థాయి నీకు లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అనేక అవినీతి ఆరోపణలు వున్న వారిని పక్కనే పెట్టుకొని, ధర్మవరంలో భయ భ్రాంతులకు గురిచేస్తూ వ్యాపారస్తులతో డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయన్నారు. తాడిమర్రి మండలంలో ఆదాని హైడల్ పవర్ ప్రాజెక్ట్ పనుల దగ్గరికి వెళ్లి అడ్డుకోవడం నిజం కాదా? అక్కడ వసూళ్లకు తెరలేపలేదా? ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయని... గుమ్మడికాయల దొంగ అంటే నేను కాదంటూ భుజాలు తడుముకునే లా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సహాయ కార్యదర్శి రమణ, ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రెటరీ మధు నాయక్, డిహెచ్‌పిఎస్ జిల్లా కోశాధికారి ఎల్‌వి రమణ, ఈశ్వరయ్య, చంద్ర, హిమలమ్మ, కళావతి, దేవి భాయ్, వాణిబాయ్ పాల్గొన్నారు.

ఏది పడితే అది వాగొద్దు

విశాలాంధ్ర - హిందూపురం : అధికారం ఉందనే అహంకారంతో కబ్జా కోరుకో కోమ్ముకాస్తు నువ్వు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణపై మాట్లాడే స్థాయి నీకు ఉందా హరీష్.. మీరు కబ్జా చేస్తున్న భూ బాధితులైన గిరిజనులకు, దళితులకు, వెనుకబడిన వర్గాలకు వెన్నంటి నడుస్తున్న ధైర్యంగా నిలబడిన పేద ప్రజలకు అండగా ఉండే మా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణపై మీ మాటలు మానుకోండి సూర్యునిపై ఉమ్మి వేయాలని చూస్తే అది మీ మీద పడుతుందని తెలుసుకో అన్నారు. మీ కబ్జాల గురించి ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రిక లలో కథనాలు వస్తున్నాయని గుర్తు చేశారు. ఆదినారాయణ రోజుకో పార్టీ మారి, పుటకో పొలాన్ని పట్టా మార్చడం కాదు బిడ్డా. ఇలాంటి కబ్జా దారుడిని వెనకేసుకుని వస్తున్న మీరెంత పెద్ద కబ్జాదారులో మాకు తెలుసు అన్నారు. మతోన్మాది బిజెపి హరీష్ నీ పద్ధతి మార్చుకో అంటూ హెచ్చరించారు.

రూ. 60 కోట్ల విలువైన భూ అక్రమాలపై విచారణ చేపట్టండి

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణంలో 60 కోట్ల విలువైన 650-2 సర్వే నెంబర్లో జరిగిన భారీ అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి విజయ సారధి వినతిపత్రం అందించారు. అనంతరం మధు మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలోని బెంగళూరు వెళ్లే రోడ్డు నందు గల 650-2 సర్వే నంబర్ లో 60 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని పేదల పేర్లు చెప్పుకొని ప్లంబర్స్ యూనియన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కుమ్మక్కై ఆ ప్రభుత్వ భూమిని అర్హులైన ప్లంబర్లకు అందకుండా తమ బినామీ పేర్లతో ఆ భూమిని అంతా నొక్కేశారు అని తెలిపారు. వీరికి అప్పటి తాసిల్దార్ రమేష్ అవినీతి అక్రమార్కులకు పూర్తిగా సహకరించారు అని తెలిపారు. 1996 లో ప్లంబర్ అంతా ఒక యూనియన్ గా ఏర్పాటు చేసుకొని పట్టాల కోసం ప్రభుత్వాన్ని విన్నవించుకోగా వారికి మంజూరు చేసింది అన్నారు. అయితే సదరు భూమి మాది అంటూ పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో అప్పటినుంచి అది పెండింగ్లో పడుతూ వచ్చిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో భూమి యజమానులు ప్లంబర్స్ యూనియన్ రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని తీర్పు దీన్ని ఆసరాగా చేసుకున్న ప్లంబర్స్ యూనియన్ ముసుగులో అప్పటి అధికార పార్టీని అడ్డుపెట్టుకొని భూమి యజమానులను బెదిరించి, మరోవైపు అసలైన ప్లంబర్స్ ని కూడా తొక్కి పెట్టేసి యూనియన్ పేరు చెప్పుకొని ముగ్గురు వ్యక్తులు దాదాపు 30 నుంచి 35 పట్టాలు తమ బినామీ పేర్లతో దోచేశారు అని తెలిపారు. అప్పటి అధికార పార్టీ వైసీపీ సహకరించినందుకు నజరానాగా అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి అనుచరులకు కూడా 10 పట్టాలు అప్పనంగా పంపిణీ చేశారన్నారు. పట్టాలు ఇచ్చినందుకు అప్పటి ఎమ్మార్వో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ కూడా 21,24,66 నెంబర్ గల పట్టాలు బినామీ పేర్లతో కేటాయించి వాటి అమ్మకం ద్వారా వచ్చిన డబ్బును సదరు తాసిల్దార్, అప్పటి కమిషనర్ కు నజరానాగా ఇచ్చినట్లు సమాచారం అని తెలిపారు. 60 కోట్ల విలువైన 2 ఎకరాల భూమి కేవలం యూనియన్‌లోని ముగ్గురు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది అని, ఆ ముగ్గురిలో డి.రాజు, డి.సురేంద్రలు అన్నదమ్ములు కావడం విశేషం అని తెలిపారు. మరో వ్యక్తి ఎస్. లతీఫ్ లు ఉన్నారు అని, రూ. 60 కోట్ల విలువ చేసే 2 ఎకరాల భూమిని యూనియన్ ముసుగులో తల్లి, తండ్రి, సోదరి, తోడల్లుడు, కూతురు, మరదలు, మేనల్లుడు, సోదరుడు, అత్త, స్నేహితుల పేర్లు పెట్టి నిండా దోచేసారాన్నారు. సదరు వ్యక్తులపై 420 కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రవి సహాయ కార్యదర్శి రమణ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజా, ప్లంబర్స్, భూ యాజమాన్యలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగి పంపిణీ

విశాలాంధ్ర-చిలమత్తూరు: స్థానిక కేజీబీవీ పాఠశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ పెడ్రేషన్ రాష్ట్ర కార్యదర్శి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు, ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ జయచంద్రా రెడ్డి సౌజన్యంతో చిలమత్తూరు యుటి ఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాల లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ సునీత కుమారి, యుటి ఎఫ్ మండల అధ్యక్షులు పి. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జి. లక్షిపతి. వి. శ్రీనివాసులు, ఎన్. నంజప్ప, పి. సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం అందజేయండి

విశాలాంధ్ర-లేపాక్షి : ప్రమాదవశాత్తు అగ్గి మంటల్లో గాలి బూడిదైన మామిడి చెట్లు చింత చెట్లకు నష్టపరిహారం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలని లేపాక్షి సిపిఐ మండల కార్యదర్శి శివప్ప కోరారు. చోళ సముద్రం గ్రామ పొలంలో సర్వేనెంబర్ 109-5 లెటర్లో 1.77 సెంట్లులలో 2015-16 సంవత్సరంలో ఉపాధి హామీ ద్వారా మామిడి చెట్లను పెంచుకోగా ఆదివారం సాయంత్రం మామిడి తోట చుట్టూ కల్ల కాలిపోయాయి. మామిడి చెట్లు కూడా కొంతవరకు దెబ్బతిన్నాయి. అధికారులు దర్యాప్తు చేసి న్యాయం చేయాలని డిప్యూటీ తాసిల్దార్ కుమార్లరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-ఓడిసి రూరల్ : ఇంటి నివేశ స్థలాలు లేని నిరుపేదలందరినీ గుర్తించి ప్రభుత్వం ద్వారా ఇంటి పట్టాలు మంజూరుచేసి, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పక్కా గృహాలు చేయాలని కోరుతూ బిజెపి మండల అధ్యక్షులు వీరాంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే లో తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ముక్కన్న కొత్తపల్లి రెవెన్యూ గ్రామ పొలం సర్వేనెంబర్ 216లో, 2 ఎకరాల 71 సెంట్లు ప్రభుత్వ భూమిలో కూడా అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వొచ్చని అన్నారు,

క్రమశిక్షణ కూడా నేర్చుకోవాలి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: చిన్న వయస్సులోనే ఉత్తమమైన విద్యతో పాటు క్రమశిక్షణ కూడా నేర్చుకోవాలని ఎంపీడీవో అంజినప్ప పేర్కొన్నారు. సోమవారం పెడబల్లి ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు,నాడు-నేడు పనుల పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో లక్ష్యాలను తెలుసుకొని వాటిని సాధించే క్రమంలో ఎదురయ్యే అవరోధాలను ఎలా అధిరోహించలో చక్కగా వివరించారు. ఏమన్నా సమస్యలు ఉంటే తెలియ జేయాలని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి,నాణ్యత పెంచాలని సూచించారు.

నాటు సారాని నిర్మూలిద్దాం

విశాలాంధ్ర-ధర్మవరం: సారాని నిర్మూలిద్దాం-ప్రగతిని సాధిద్దాం అని ఎక్సైజ్ సీఐ చంద్రమణి తెలిపారు. సోమవారం పట్టణంలోని కళా జ్యోతి సర్కిల్ వద్ద మానవహారాన్ని నిర్వహించి సారాపై కళాజాత బృందం పాలు పాటల ద్వారా, డాన్సుల ద్వారా సారా వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎక్సైజ్ సీఐ చంద్రమణి మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ శాఖ సంకల్పం గా ముందుకు వెళుతుందని, నాటు సారాకి దూరం, ఆరోగ్యానికి మహాభాగ్యమని తెలిపారు. ఎస్సై నాగరాజుపాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తీర్చడానికే ..

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రజల సమస్యలు తీర్చడానికే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యమని ఆర్డిఓ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో సమావేశ భవనంలో ధర్మవరం రెవెన్యూ డివిజన్ లోని ఏడు మండలాల ప్రజల సమస్యల కొరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ ఏ సమస్యకు సంబంధించిన అంశమైన, అక్కడికక్కడే పరిష్కరించబడేటట్లు ప్రయత్నం చేస్తామని, లేనియెడల షెడ్యూల్ తేదీలలో తప్పక పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. మొత్తం 15 దరఖాస్తులు రావడం జరిగిందని వారు తెలిపారు. ఈ దరఖాస్తుల ద్వారా విచారణ జరిపి ఆయా మండల అర్జీదారులకు న్యాయం తప్పక చేయడం జరుగుతుందని తెలిపారు. ఏడు మండలాల వివిధ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ధర్మవరం: హక్కులను, చట్టాలను మహిళలం దరూ సద్వినియోగం చేసుకున్నప్పుడే సుఖవంతమైన జీవితం లభిస్తుందని లాయర్ సుమలత, ఆర్‌డిటి ఏ టి ఎల్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ధర్మవరం మండలంలోని ఓబుల నాయనపల్లి గ్రామ క్లస్టర్ ఆధ్వర్యంలో 90 సంఘాలు, 29 గ్రామ మహిళల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. తొలుత పట్టణంలోని పలు కూడలిలో ఫ్లెక్సీ చేత పట్టుకొని మహిళల హక్కులు వాటి చట్టాలపై ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. లాయర్ సుమలత, ఆర్ డి టి ఎ టి ఎల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హక్కులను, చట్టాలను దుర్వినియోగం చేయకుండా సమాజానికి కుటుంబానికి ఉపయోగించుకోవాలని తెలిపారు. దాడులను ఎదుర్కోవాలంటే ప్రతి మహిళ ఝాన్సీ లక్ష్మీబాయిలా ఎదగాలని తెలిపారు. కుటుంబములో ఆడా మగా అనే తేడా లేకుండా అందరినీ సమానంగా చూడాలన్నారు. పేదల పాలిట కల్పతరువు ఆర్డిటిసంస్థ అని కొనియాడారు. ఓబులాయన పల్లి మహిళలు, పురుషులు, ఆర్‌డిటి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో భోజనం నాణ్యతగా ఉండాలి..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని రెండు క్యాంటీన్లలో భోజనము, అల్పాహారం నాణ్యతగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. సోమవారం అన్నా క్యాంటీన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల్ని భోజనం రుచి, నాణ్యత, తదితర సమస్యలను అడిగి తెలుసు కున్నారు. స్వయంగా భోజనం అల్పాహారం రుచి కూడా చూశారు. అన్నా క్యాంటీన్‌కు వచ్చేవారిని గౌరవంగా పలకరించాలని, ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం తెల్లవారుజామున అంజుమాన్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, తేరు బజార్, మెయిన్ రోడ్, మండి మార్కెట్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులకు తగిన సూచనలు సలహాలు అందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్, కేశవ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారులు ఎంపిక...

విశాలాంధ్ర-ధర్మవరం : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని, కోచ్ పృథ్వీ తెలిపారు. సోమవారంఆయన మాట్లాడుతూ గుంతకల్ రైల్వే క్రీడా మైదానంలో జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా కబాడీ పోటీలలో ధర్మవరంకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి కబాడీ పోటీలకు ఎంపిక కావడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి కబాడీకి ఎంపికైన క్రీడాకారులలో ఆసిఫ్, రాజు, సాజియాలు కలరని తెలిపారు. వీరు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు పులివెందులలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ప్రతిభ ఘనపరిచిన క్రీడాకారులు ధర్మవరంలోని వివేకానంద స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్డిటి క్రీడా మైదానంలో కబడ్డీ శిక్షణ పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఈ క్రీడాకారులను సీనియర్ క్రీడాకారులతోపాటు కోచ్ పృథ్వీ కూడా అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

12న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోండి..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని తారకరామాపురం, గుట్ట కిందపల్లి వద్ద గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 12వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జేవీ. సురేష్ బాబు, ఏపీఎస్ ఎస్‌డిసి జిల్లా నైపుణ్యాధికారి బి.హరికృష్ణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 5 కంపెనీల కొరకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 18 నుంచి 33 సంవత్సరాల లోపు ఉన్న వారందరూ కూడా అర్హులని తెలిపారు. నెలకు వేతనం రూ.13 వేల నుండి రూ.20వేల వరకు ఉంటుందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు హైదరాబాదు పెనుకొండ, పాలసముద్రంలో ఉద్యోగం చేయవలసి ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్ కార్డు విద్యా అర్హత పత్రాలు తీసుకొని ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9182288465కు సంప్రదించాలని తెలిపారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 11, మార్చి 2025

అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

వన్ సర్వే నెంబర్ -వన్ ఇ-ఫైల్ విధానం అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర - అనంతపురం : అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, డిప్యూటీ కలెక్టర్ లు తిప్పేనాయక్, ఆనంద్, రామ్మోహన్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 419 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం గ్రామంలోని మారుమూల నిరుపేద కుటుంబాలకు చేరే విధంగా చూడాలని, ఆ విధంగా అధికారులు ప్రణాళిక తయారు చేయాలన్నారు. అదేవిధంగా గ్రామంలో ఉండే ప్రజలకు ఎవరికి ప్రభుత్వ పథకాలు లభించలేదో గుర్తించి, అర్హత గల వారికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. మండల అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో స్థాయిలో వీటిని అమలు అయ్యే విధంగా చూడాలని, అలాగే గాంధీ చెప్పినట్టు వరుసలో చివరన ఉన్నటువంటి వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, సిపిఓ అశోక్ కుమార్, డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, హౌసింగ్ పిడి సైలజ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, డ్వామా పీడీ సలీమ్ భాష, డిటిసి వీర్రాజు, పిఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, డా.ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, డిఈఓ ప్రసాద్ బాబు, సర్వే ఏడి రూప్ల నాయక్, పశు సంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, ఎల్డిఎం నర్సింగరావు, డిపిఓ నాగరాజు నాయుడు, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, డీసీఓ అరుణకుమారి, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పెనుకొండ : అంగన్వాడి సెంటర్లు బంద్ చేసి, సెక్టార్ మీటింగ్ బహిష్కరించి సోమవారం పెనుకొండ ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అంగనవాడి వర్కర్లు హెల్పర్లు, అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో 42 రోజులపాటు సమ్మె నిర్వహించడం జరిగింది. ఆ సమ్మె సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నేను అధికారంలోకి వస్తే మీ సమస్యలన్నీ పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఆ హామీ అమలు చేయాలని అనేకమార్లు ముఖ్యమంత్రుల నుండి మంత్రి ఎమ్మెల్యే అధికారుల విన్నవించడం జరిగింది. ఈ ప్రభుత్వం కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ,రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్ గా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని, మెనూ చార్జీలు పెంచాలి ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలి ,వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం 3 నెలలు ఇవ్వాలి ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలి ,సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగాలు అనే పదం తొలగించాలని, ప్రీస్కూల్ బలోపేతం చేయాలి, ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి, 5 సంవత్సరాలు లోపు పిల్లలందరికీ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని జీవో ఇవ్వాలి, ప్రీ స్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలి ,వేసవిలో సెలవలు అందరికీ ఇవ్వాలి తదితర డిమాండ్లు వినతి పత్రం డిప్యూటీ తాహసిల్దార్ గిరికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జయమ్మ, జయతుంబి ,లక్ష్మీదేవి, సెక్టార్ లీడర్లు లక్ష్మీదేవి ,పార్వతి, శాంతి భాయ్, సరస్వతి, అనూష, అలివేలమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - ధర్మవరం : ధర్మవరం ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలను గైకొనాలని కోరుతూ ఆర్డిఓ మహేష్‌కు వినతి పత్రాన్ని సిఐటియు నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా తొలుత పట్టణంలోని పలు కూడలిల ద్వారా వందల సంఖ్యలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు మండల కన్వీనర్ జేవి రమణ, కో కన్వీనర్ అయూబ్ ఖాన్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి చంద్రకళ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తెలిపిన ప్రకారం కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని తీర్పు ఇస్తే ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేకపోవడం దారుణము కాదా అని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకు రాలు పోతక్క, దీన, సునీత, ఫాతిమా, చింతమ్మ, అరుణ, లక్ష్మీదేవి, గోవిందమ్మ, వేదవతి, గంగరత్న, చిట్టెమ్మ, ప్రాజెక్టు పరిధిలోని వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

నాక్ ట్రైనింగ్ సెంటర్ నందు జాబ్ మేళా

విశాలాంధ్ర - గుంతకల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో గుంతకల్ పట్టణం నందు గల నాక్ ట్రైనింగ్ సెంటర్ నందు ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నాక్ ఏడి గోవిందరాజులు, డి ఎస్ డి ఓ ప్రతాప్ రెడ్డి సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కాబట్టి పట్టణంలో గల నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - అగళి : స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. 6 వ తరగతి లో చేరడానికి ఫిబ్రవరి 25 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ధరఖాస్తు చేసుకున్న పిల్లలకు, పరీక్షకు సన్నద్ధం చేయటకు, అగళి మోడల్ స్కూల్ లో మార్చి 11 నుంచి ప్రత్యేక కోచింగ్ క్లాసులు ఇర్వహించడం జరుగుతుందన్నారు.ప్రతి రోజు 4 గంటల నుంచి 5 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు.ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా మనవి, ధరఖాస్తు చేయడానికి మార్చి 31 వరకు అవకాశం వుందన్నారు. ఏప్రిల్ 20 న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

శ్రీ బాలాజీ పీజీ కళాశాల విజయభేరి

విశాలాంధ్ర - జేఎన్టీయూపీ : శ్రీ బాలాజీ ఎం.సి.ఏ కళాశాల లో గ్రాస్ రూట్స్ కంపెనీ ఎస్ఓపి, ప్రాసెస్ అసోసియేట్ స్థానాలకు ప్రాంగణ నియామకాల్లో విజయభేరి మోగించింది. నియామకాల్లో విద్యార్థులను ఆప్టిట్యూడ్ టెస్ట్ గ్రూప్ డిస్కషన్, హెచ్ఆర్ రౌండ్‌లో ఎంపిక చేశారు. 150 మంది విద్యార్థులు పాల్గొనగా 13మంది ఎంపికయ్యారు. వీరిని బెంగుళూరులో పని చేయడానికి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ పల్లె కృష్ణ కిషోర్, డైరెక్టర్ పల్లె సింధూర రెడ్డి, ప్రిన్సిపాల్ డా.సి. మన్మథేశ్వర రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ప్రొ.శ్రీనివాసులు రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ఎం.సి.ఏ. విభాగాధిపతి కబీర్ బాషా, ఎం.బి.ఏ. విభాగాధిపతి సర్ఫరాజ్ రహీమ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

హిందువులపై దాడులు చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర-పెనుకొండ : రాయచోటిలో హిందువులపై, శ్రీ వీరభద్రస్వామివారి ఉత్సవం పై జరిగిన దాడికి సంబంధించి రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం పెనుకొండలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, హిందూ కుల సంఘాలు, యువకులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక మిట్ట ఆంజనేయస్వామి దేవాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో "హిందువుల ఐక్యత వర్ధిల్లాలి రాయచోటి అర్బన్ ఎస్సై ని సస్పెండ్ చేయాలి, హిందువులపై దాడులు చేసిన వారిని వెంటనే శిక్షించాలి అనే నినాదాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా విహెచ్పి నాయకులు మాట్లాడుతూ హిందువులపై దౌర్జన్యంగా దాడికి పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం ఆర్డీవోకి వినతి పత్రం అందజేశారు.

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫి) ఆధ్వర్యంలో సోమవారం హిందూపురం ఎంపీ బి.కె. పార్థసారథికు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. లియాఫీ కడప డివిజన్ గౌరవాధ్యక్షులు ఎస్. తిరుపతయ్య ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, సీనియర్ ఏజెంట్ వెంకటనాయుడు, వేణుగోపాల్, మల్లికార్జున రెడ్డి, భాస్కర్, శ్రీనివాసులు,నరేంద్ర, మధు, బాలకృష్ణ తదితరులు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్లకు అనేక సమస్యలు ఉన్నాయని వీటన్నింటినీ పార్లమెంటులో చర్చించి కేంద్ర ప్రభుత్వం దగ్గర పరిష్కారం చూపాలని కోరారు. ఎల్ఐసి ని దినదిన అభివృద్ధి చేయడంలో ఏజెంట్ల పాత్ర ఎంతో ఉందని, తమకు కమిషన్ పెంచాలని అడిగితే ఇప్పుడున్న కమిషన్ కూడా తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలసీదారులకు జీఎస్టి భారం మోపి ప్రీమియం ఎక్కువగా కట్టించకోవడం అన్యాయమన్నారు. బోనస్‌ను పెంచాలని, గ్రామీణ ప్రాంత ప్రజలకు అనువుగా ఉండేటట్లు లక్ష రూపాయల బీమా పాలసీలను పునరుద్ధరించాలని, డైరెక్ట్‌గా ఏజెంట్లకు ఇన్సెంటివ్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో గత ఆరు నెలల నుండి తాము ఆందోళన చేస్తున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సమాఖ్య నాయకులు ఎంపీ దృష్టికి తెచ్చారు. ఈనెల 19న ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర జేఏసీ ఆధ్వర్యంలో లక్షలాదిమంది ఏజెంట్ ధర్నా చేపట్టామని ఈ కార్యక్రమానికి ఎంపీలు మద్దతు అందించాలని కోరారు. దీనికి స్పందించిన ఎంపీ పార్థసారథి తాము మీకు మద్దతుగా నిలుస్తామని భరోసా కల్పించారు.

గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పి ఎం ఎస్ ఏ ప్రోగ్రామ్‌లో భాగంగా ఐ రిస్క్ గర్భవతులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర ఆధ్వర్యంలో సోమవారం గర్భవతులను ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారికి రక్త పరీక్షలు నిర్వహించడం జరిగినది ఆసుపత్రికి వచ్చిన గర్భవతులకు తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు గర్భవతులకు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత అలాగే రక్తహీనత గురించి వివరించినారు డాక్టర్ 108 ద్వారానే ప్రభుత్వ ఆసుపత్రులకు కాన్పులకు వెళ్ళమని తెలియజేశారు ఇక్కడికి వచ్చిన గర్భవతులకు రాయలచెరువు గ్రామానికి ప్రముఖ పారిశ్రామికవేత్త సివిఆర్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ సివి రమణారెడ్డి ఉచిత భోజనం వసతి కల్పించారు. ఏం ఎం ఎస్ ఏ ప్రోగ్రామ్‌లో 70 మంది గర్భవతులు హాజరైనారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ జుబేదా, సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్ ఏ ఎన్ ఎం లు ఎం ఎల్ హెచ్‌పిలు ల్యాబ్ టెక్నీషియన్ శిరీష ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడాలి

విశాలాంధ్ర-ఉరవకొండ : రాష్ట్రంలో మతసామరస్యాన్ని కాపాడడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఉరవకొండ నియోజకవర్గం వీరశైవ సంక్షేమ సమాజం నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉరవకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ మార్చి 4వ తేదీన రాయచోటి పట్టణంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఉత్సవ వేడుకలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా చూడాలని,ఇరువురు మత పెద్దలను సమావేశ పరిచి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని,అలాగే ఈ అల్లర్లలో అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ప్రతి మతం వారు వారి వారి సంప్రదాయాలను పాటిస్తూ ఎదుటి మతం యొక్క సంప్రదాయం ను గౌరవించు కునే విదంగా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన ంతరం స్థానిక మండల తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వీరశైవ సంక్షేమ సమాజం కార్యదర్శిపాటిల్ నిరంజన్ గౌడ్, దేశాయి గంగాధర్, ఉపాధ్యక్షురాలు మఠం నందిని, చీకల గురికి బొజ్జప్ప, మఠం యోగేశ్వర స్వామి, రాకెట్ల మఠం వీరేష్ స్వామి, మోపిడి చంద్రమౌళి,ఉండబండ బండప్ప,వికాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర - శెట్టూరు : గర్భిణీలకు పోషక ఆహారం పంపిణీ చేసిన హెల్పింగ్ హాండ్స్ టీం సభ్యులు సత్యనారాయణ, సుఖేష్, మహేష్, నవీన్, కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ప్రతినెల పదవ తారీకు నిర్వహించి గర్భవతుల చికిత్స నిమిత్తం మండల ఆరోగ్య కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి చికిత్స కోసం వచ్చే గర్భిణీలు ఇబ్బంది గుర్తించి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు గత 10నెలల నుంచి కూడా 50 మంది గర్భవతులకు, ఓపి పేషెంట్లు కూడా ఆహారాన్ని అందిస్తున్నారు. పోషకాలతో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మాట్లాడుతూ ఈ మంచి కార్యక్రమం మా మిత్రుల సహకారంతో ప్రతి నెల చేయడం మా స్నేహితులందరికీ కూడా సంతృప్తినిచ్చిందని వారు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైనవాటిని కూడా సహాయం చేయడానికి ముందుంటామని మాకు సహరిస్తున్న డాక్టర్ తరుణ్ సాయి ప్రాథమిక ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రధానం

విశాలాంధ్ర-గుత్తి : పట్టణం కోట హై స్కూల్ లో సోమవారం గత నెలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ లయన్ రుకియా బేగం, గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వీకే వాణి, కోటా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుభాన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సి రమేష్,కే ఎస్ కే ట్యూషన్స్ డైరెక్టర్ సునీల్, సాధన స్కూల్ కరస్పాండెంట్ పి కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇలాంటి మోడల్ పరీక్షలు పదవ తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని పదవ తరగతి అనేది ఎంతో విలువైనది బాగా కష్టపడి చదువుకొని పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఎవరు కూడా పదవ తరగతి పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఈ మోడల్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ మహిళా కమిషన్ మెంబర్ లయన్ రుఖియా బేగం, గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వీకే వాణి, కోటా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుభాన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్,కే ఎస్ కే ట్యూషన్స్ డైరెక్టర్ సునీల్,సాధన స్కూల్ కరస్పాండెంట్ పి కృష్ణయ్య,మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు లాల్ శేఖర్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ధను, నాయకులు నవీన్ యాదవ్, సాయి, భరత్, జిలాన్ పాఠశాల ఉపాధ్యాయులు రఘురాం,పిటి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - బొమ్మనహాల్ : మండలంలో నీ సింగేపల్లి గ్రామంలో ప్రభుత్వ మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘంఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తినే మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లేదన్నారు. టీచర్లు కూడా సపరేట్‌గా వండుకొని తింటున్నారు అని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు సన్న బియ్యం పంపిణీ చేస్తాం అని చెప్పి నాన్యత లేని బియ్యని పంపిణీ చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు తినే భోజనంలో నాణ్యతలేని కారణంగా విద్యార్థులు తినడానికి ఇష్టపడకుండా నాసిరకం బియ్యంతో వండుతున్నారు అని అన్నారు. కానీ ప్రతి స్కూల్ యాజమాన్యం మాత్రం స్కూలులో ఎంతమంది ఉంటే అంతమందికి అటెండెన్స్ వేసి బిల్స్ పెట్టుకొని కాసులను సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల కణేకల్ మండలం అధ్యక్షులు బాబా పకృద్దీన్ కార్యదర్శి మహీంద్రా, గంగరాజు,ఆనంద్ రాజు శర్మస్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రి భాయ్ పూలే సేవలు మరువలేనివి..

విశాలాంధ్ర-ఉరవకొండ : మహాత్మా సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం స్థానిక గాంధీ హరిజన హాస్టల్ ప్రాంగణంలో దళిత, గిరిజన ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సావిత్రిబాయి. మహారాష్ట్రలో పూణే జిల్లాలో 1831లో జన్మించి మహిళా ఉపాధ్యాయులుగా బడుగు బలహీన వర్గాల మహిళలకు చదువు అవసరమని తెలిసి వారి అభివృద్ధికి బాటలు వేశారన్నారు ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు కూడా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మీనుగ గోపాల్, చాబాల గ్రామ సర్పంచ్ మల్లెల జగదీష్, ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మధు, జి వి వి కే రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం, డి జి హెచ్ ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు సాకే రమేష్ బాబు పాల్గొన్నారు.

కార్మికుడు మృతికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పెనుకొండ : నగర పంచాయతీకి చెందిన ఇస్లాపురం గ్రామానికి చెందిన నగర పంచాయతీ లో పనిచేసే కార్మికుడు సోమవారం రైల్వే ట్రాక్ పైన ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్,మృతుని భౌతికకాయాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది, తక్షణ సాయం కింద మున్సిపల్ కమిషనర్ బాధిత కుటుంబానికి 18 వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు కౌన్సిలర్ హనుమంతు ప్రజాసంఘాల నాయకులు గంగాధర్ రమేష్ , మున్సిపల్ మేనేజర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి పలువురు సంతాపం

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధి లోని నాగలూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ,మాజీ సర్పంచ్ మహమ్మద్ ఖాన్(65) సోమవారం అనారోగ్యంతో మరణించాడు. సీనియర్ టిడిపి నాయకుడు మహమ్మద్ ఖాన్ అకస్మిక మృతి విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, మాజీ జడ్పీటీసీ నారాయణ స్వామి, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు తదితరులు పాల్గొని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కేశవయ్య, శ్రీనివాసులు, సూర్య నారాయణ, ప్రసాద్,త్రివేంద్ర, సుబ్రహ్మణ్యం, సోము, గోపాల్, సాయి రమేష్ తదితర టిడిపి నాయకులు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశువుల సంత వేలంపాట వాయిదా

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మండల కేంద్రంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించవలసిన వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల సంత, కూరగాయల సంత,దినసరి బస్టాండ్ వేలంపాటను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేయడమైనదని తదుపరి వేలంపాట తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోండి

విశాలాంధ్ర - అగళి : రైతులు తప్పనిసరిగా తామ భూములకు భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇరిగేపల్లి, అగళి మధుడి, నగలూరు, రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు, రైతులు నత్రజని భాస్వరం పొటాషియం ప్రతి పంటకు వేయాల్సి ఉంటుందని కావున భూసార పరీక్షలు చేస్తే ఏభూములకు ఏ ఎరువులు వాడాలి, అనే అంశాలను తెలియపరుస్తామని ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలను అందించారు.

మిట్స్‌లో జాతీయ ఐపీ యాత్ర ఆవిష్కరణ

విశాలాంధ్ర - జెఎన్టియుపి : మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ (మిట్స్) కలశాలలో మేథో సంపత్తి ఆవిష్కరణ భవిష్యత్తును ఎలా రూపొందిస్తుందో అన్వేషించడానికి అంకితమైన సదస్సును కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సృజనాత్మక రచనలను రక్షించడం సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధనలకు వేదిక కానుంది అని అన్నారు. ప్రిన్సిపాల్ యువరాజ్ మాట్లాడుతూ పరిశోధకులు, పరిశ్రమ అనుభవజ్ఞులతో వాటాదారుల చర్చలు, వ్యాపారాలు, స్టార్టప్‌ల నిపుణుల సెషన్‌లు, పరిశోధకులు, పరిశ్రమ నాయకులు విధాన నిర్ణేతలతో నెట్‌వర్కింగ్ అవకాశాలు పేటెంట్ దాఖలు, ట్రేడ్‌మార్కులు, కాపీరైట్‌లపై ఆచరణాత్మక మార్గదర్శకాన్ని ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో యెన్. ద్వారకనాథ్, ప్రెసిడెంట్, ఆర్ ఆర్ ఆర్ ఎడ్యుకేషన్ అకాడమీ, అడ్వైసర్ డాక్టర్ తులసీరామ్ నాయుడు, అసోసియేట్ డీన్ ఆర్.డి డా.శివయ్య పాల్గొన్నారు.

12న యువత పోరును విజయవంతం చేయండి

విశాలాంధ్ర -శింగనమల: మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపం లో సోమవారం ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యువత పోరు పోస్టర్లను మాజీమంత్రి వైఎస్ఆర్సిపి నాయకుడు సాకే శైలజనాథ్, మాజీ ఎంపీ తలారి రంగయ్య, టిప్పర్ డ్రైవర్ ఎం వీరాంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం సాకే శైలజనాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మోసపోతున్న విద్యార్థు లు, యువతకు తోడుగా వైఎస్ఆర్సీపీ నిలుస్తుందని, ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం నుండి యువత పోరు ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. సప్తగిరి సర్కిల్, సూర్యనగర్ రోడ్డు మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. యువత పోరు'లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి, తరిమెల వంశీ గోకుల్ రెడ్డి, చామలూరు రాజగోపాల్, గువ్వల శ్రీకాంత్ రెడ్డి,ముఖ్య వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఉరవకొండ :ఈనెల 12వ తేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే యువత పోరుకును విజయవంతం చేయాలని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

విశాలాంధ్ర-పామిడి : విద్యార్థులు నిరుద్యోగుల యువత భవిష్యత్తుపై నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తూ వారి జీవితాన్ని నాశనం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనకు నిరసనగా రేపు బుధవారం 12తేదీన ఉదయం 10 గంటలకు యువత, వారి తల్లిదండ్రులతో కలసి కలెక్టర్ కార్యాలయానికి వినతి పత్రము ఇచ్చుటకు కదలి రావాలని వైయస్సార్ పార్టీ జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి, గుత్తి మార్కెట్ యార్డ్ మాజీ ప్రెసిడెంట్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి సంయుక్తంగా సోమవారం ఒక పత్రికా ప్రకటనలో పిలుపునిచ్చారు. పీజు రియంబర్స్మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యలను వదిలేస్తున్నారని, డ్రాపౌట్సు సంఖ్య పెరుగుతోందని, ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, బాబు వైఖరిని ఎండగట్టుటకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

విశాలాంధ్ర-తాడిపత్రి: విద్యార్థులకు పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని నియోజకవర్గ వైయస్సార్సీపి యువ నాయకులు గంగలకుంట కేశవ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లితండ్రులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వంలో మోసపోతున్న విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు తోడుగా వైఎస్ఆర్‌సీపీ నిలుస్తుందన్నారు. ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం నుంచి యువత పోరు ర్యాలీ ప్రారంభం అవుతుంది. సప్తగిరి సర్కిల్, సూర్యనగర్ రోడ్డు మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. కావున వైసిపి కార్యకర్తలు నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.